# నాన్న గారి శవం

అవును. అది చంద్రనిప్పులు చెరగవలసిన మండు వేసవే. కాని,

ఆ రోజెందుకోగాని భోరున వర్షవే; అరుకునుంచి శృంగారపుకోట వరకూ వర్షవే; తండ్రి చచ్చిపోయాడని టెల్లిగ్రామువస్తే దట్సాల్ రైట్; టేక్ లీవ్ అండగో అన్నారు కాని ఆ "గో" ఎలాగ? మీ నాన్నగారి శవానికి చేతుల్తో చితిముట్టించాల్సిన పనున్నప్పుడు ఆ అడివి నుంచి రెక్కలు కట్టుకుని ఎలా వాలగలరు? మీ అమ్మ దగ్గరుండాల నుంది మీకు మీ నాన్నగారి శవానికి కడసారి నమస్కరించాలనుంది మీకు. కాని ఎక్కడి నిడదవోలురాజుగారి ఆసుపత్రి, ఎక్కడి అరుకువేలీ? గోలెత్తి పోయారు. కోడిగుడ్డుకోసం కోడిగుడ్డు చిమ్నీల కోసం జీపుల్నితోలి పెట్రోలును మంచినీళ్ళలా కర్చు పెట్టే మీ ఆఫీసువారు మీకు బండినివ్వటాన్కి తటపటాయించేరు.

అది చంద్రనిప్పులు చెరగవలసిన మండు వేసవే. కాని ఆ రోజెందుకో వర్షం పడింది. ఆ వర్షంలో తడుస్తూ టెలిగ్రాఫ్ బంట్రోతు పిడుగులాటి వార్త తెచ్చాడు.

మీ నాన్నగారు పోయారని -

మీ అమ్మవక్కర్తీ ఆసుపత్రిలో వుందని -

ఒంటిరిగా-నిస్సహాయురాలు, ఆడది కన్నతల్లి కడు దీనావస్థలో చిక్కడ్డది.

ఆ శవం - ఆవిడా, ఇద్దరూ... కాదు ఒక్కర్తీ ఏమైపోతోందో -

ఇక్కడా వర్షమే, అక్కడావర్షమే అయితే...

మీ నాన్నగారి శవం -

తెలిసింది, తరవాత తెలిసింది.

ఆసుపత్రినుంచి త్వరగా శవాన్ని వెంటనే తీసుకుపొమ్మన్నారనీ -

అప్పుడు -

"అయ్యో; అమ్మా; తల్లీ, తండ్రీ, నాయన్లారా-"

నేనాడదాన్ని నా కొడుకులు దూరాల్నున్నారు.

నే నేం చేసుకోనీ శవాన్ని....

బాబుల్లారా; నా యెడల కనికరించండి; ఎక్కడో పంచలో ఈ కట్టెను పెట్టుకొని నన్ను కూర్చుండనివ్వండి, చచ్చి మీ కడుపున పుడ్తాను, నావాళ్ళొస్తారు.

నా బిడ్డలొస్తారు.

వాళ్ళను కడసారి తండ్రిని చూసుకోనివ్వండి

నేనాడదాన్ని; దీనురాల్ని;

అంతమందీ వున్నా ఈ క్షణం యిప్పుడు యింత కష్టంలో మిమ్మల్ని చేతులెత్తి అభ్యర్థిస్తున్నాను.

మొక్కుకుంటున్నాను.

వేడుకుంటున్నాను.

ఈ శవాన్ని నేనేం చేసుకోను -

నాకు గాఢాంధకారం కమ్మేసింది. అన్నలారా అక్కలారా నాకు కళ్ళు కనపడటంలేదు.

అన్నా, బ్రతిమాలినా ఎవరి గుండె కరగలేదు. శవాన్ని రిక్షాలో వేసుకొని ఏడుస్తూ ఎంతో దర్జాగా హోషుగా బ్రతికిన ఇంటిగుమ్మం ముందర నట్టనడి వీథిలో నేలమీద ఆ పుణ్యపురుషుడి భౌతికకాయాన్ని పెట్టుకుని కూర్చుంది, ఆ మహా ఇల్లాలు.

అంతటితోకసి తీరనట్లు -

ఆకాశం రంయ్ రంయ్ మని లేచింది. గాలి సుళ్ళు తిరిగింది. చెట్లు వెర్రిగా తలలూపాయి మనుష్యుల కర్కశాన్ని చూసో ఆ మహా యిల్లాలి కష్టం చూడలేకో ఆకాశం గుండెలు బ్రద్దలయికుండపోతగా వర్షం కురిసింది.

అయ్యో! అవును అది చంద్రనిప్పులు చెరగవలసిన మండువేసవే; కాని ఎందుకో వర్షం కురుస్తోంది.

అప్పుడు మీనాన్నగారి శవం ఎవరూ స్నానం చేయించనక్కర్లేకుండానే తడిసి బురదలో పొర్లాడింది.

అప్పుడు ఆ ఇల్లాలు మళ్లీ అడిగింది -

"అమ్మా! అయ్యా! బాబూ!

మీ అరుగుమీద నా భర్త శవాన్ని పెట్టుకోనీయరండమ్మా; మీ మేలు మర్చిపోను, నా బిడ్డలు వచ్చేదాకా - నాకు దిక్కు తెలిసే వరకూ, పోనీ మీ కారుషెడ్డు తాళాలివ్వండమ్మా - ఆ పంచన ఆ శవాన్ని పెట్టుకుని కూర్చుంటాను.

ఆశ్చర్యంగా తలుపులేసుకుని ముసుగుతన్ని పరున్నారు. చెట్టు క్రింద శవాన్ని ఆడదాన్ని వదిలేసి.

అప్పుడీ శవాన్ని వదిలించుకోవటం ఎలాగ? ఈ వర్షంలో ఎంతసేపు యిలా నేనీ చెట్టుక్రింద కూర్చుంటాను అని మీ అమ్మ వాపోయింది.

ఇంత కిరసనాయిలు ఒక అగ్గిపుల్ల గీస్తే పిడికెడు బూడిద అయిపోయే దానికి అరుగులూ, పంచలూ ఎందుకమ్మా అన్నారుట కొందరు.

పుట్టడం పుణ్యం, చావడం మహాపాపమా తెలియ కడుగుతాను? అద్దె ఇళ్ళలో ఎవరూ చావకూడదా? సొంత ఇళ్ళ వాళ్ళేకాని మరెవరూ ఆ పుణ్యానికి నోచుకోలేదా?

మనతోటిప్రాణి అందులో ఆడది రారానికష్టంలో మొగుడు చచ్చి దుఃఖిస్తూంటే సాయంచెయ్యడం పోయి యింతహింస పాల్జెయ్యడం ఇది భక్తా - ఇది మతమా? ఇది ఆచారమా? ఏమతం శవాన్ని చెట్టుక్రింద వీథిలో పారేసి దయాహీనంగా తలుపులు మూసుకోమని చెబుతుంది?

అంతా పిడికెడు బూడిద కావలసినవారే; చావుకో ఇల్లు పుట్టుకకో ఇల్లూ అని రెండిళ్ళు ఎవరికీ లేవుగదా;

పోయినవ్యక్తి ఎటువంటి మనిషి, చీమకి అపకారం చేయని వాడే - పంతులుగారు పంతులుగారు అని తామంతా కూడా కూడా తిరిగారే; తమతో కష్టసుఖాల్ని పంచుకుని సంఘంలో ఎంతో మర్యాదగా మెసలిన ఒక పుణ్య పురుషుడ్ని సత్కరించే తీరు ఇదేనా!

ఆయనది -

నిండుమనమ్ము

నవ్యనవనీత సమానము

పల్కు

దారుణా ఖండల శస్త్రతుల్యము

ఆ అవమానం చచ్చిన శవాని కెందుకవుతుంది? అది బ్రతికి వున్న సంఘానిది? ఈ సంఘం ఎంత కుళ్ళిపోయిందొ - ఇది పాడు ఆచారాలు దుర్మార్గపుటలవాట్లతో ఎలా క్రూరంగా పాషాణసదృశ్యంగా దీనులు హీనులపట్ల ప్రవర్తిస్తుందో తల్చుకుంటూంటే ఈ దేవుళ్ళు, ఈభోగాలూ ఈ తంతులన్నీ వట్టి బూటకాలూ, నాటకాలూ, దొంగెత్తులూ, టక్కర్లూనని నా కనిపిస్తోవుంటుంది. నిజం కూడా -

మానవత్వం లేక పోయాక - జాతి, కులం, మతం వుంటేనేమి, పోతేనేమి.

చచ్చిన శవానికేమీ అక్కర్లేదు - ఆ మాట నిజవే!

కానీ లేని అసహాయుల్ని నిస్సహాయస్థితిలో చెట్టుక్రింద శవాన్ని పెట్టుకు కూర్చోమన్న మీ జాతులూ, గొప్పలూ వుంటేనేం? తగలడ్తేనేం? ఇటువంటి సమాజానికి ఒక నిప్పుపుల్ల గీసే రోజు ఎప్పుడొస్తుంది? చప్పునొస్తుందా;

చివరకు ఎవరెవరో వచ్చారు.

ఆ శవాన్ని మీ అమ్మఒళ్లో నుంచి లాక్కుని తీసికెళ్ళి పిడికెడు బూడిద చేశారు.

ఆ మర్నాడుదయం - మనం చేరుకున్నాం గొల్లుమంటూ,

ఏడుస్తూ ఆ బూడిదను ఎత్తిపోయడానికి వెళ్ళేరు మీరు.

అది మండు వేసవి. ఆవేళ ఆకాశం చంద్ర చంద్రం తీవ్ర తీవ్రంగా వుంది -

అప్పుడంతా మీనాన్నగారి కిలా అయిందా అని మిమ్మల్ని ఓదార్చారు. మళ్ళీ అంతా ముఖాలకు మేలురకం చిరునవ్వులు, ముసుగులు తగిలించుకున్నారు.

"విపులాచ పృథ్వీ" - ఇంత విశాలమైనది కదా - పృథ్వి - ఎక్కడ చచ్చిపోతేనేం?

ఏ శవాన్నైనా కిరసనాయిలు పోసి అగ్గిపుల్ల గీసి తగలేసేదవే - ఆ అగ్గిపుల్ల గీయడానికి, మంత్రసాని పురుడుపోయడానికి మధ్య కలదే మానవజాతి సజీవ చరిత్ర -

పురిటి మంచం మీదనుంచి వల్లకాట్లో చేరే వరకూ కల చిరసంఘర్షణే మానవ జీవితం - అన్నా మానవ జీవితం; అప్పుడా ఇల్లాలు తీవ్రముగా శపించింది. మానవ సమాజాన్ని, మానవ నాగరికతనూ, మనుష్యుల భేషజాన్ని, దొంగెత్తుల్నీ, నంగిరి పింగిరి మాటల్నీ మాయా నాటకాలనూ మోసాల్నీ అభిశంసిస్తూ -

అద్దెకొంపల్లో ఉన్నవారూ, సొంతకొంపల్లో వారూ, పేవుమెంట్లమీద బ్రతికినవారూ, చెట్ల క్రింద సంసారాలుచేసే దీనులూ హీనులూ అంతా ఊళ్ళోంచి కాట్లోకిపోవలసినవారే; ఈ మాత్రానికి – జాతుల్నీ, మతాన్నీ, దేవుడ్నీ, ఆచారాల్నీ అడ్డుపెట్టుకుని అన్నలారా అమ్మలారా; అక్కలారా; దొంగనాటకా లాడకండి – పీకలు కత్తిరించకండి; బూడిదలో పన్నీరు పోయకండి; మీరంతా సంతోషంగా వుండాలి నిజవేఁ, అందుకు కొంపల్లో చిచ్చు పెట్టకండి.

– నాయన్లారా కాస్త జాలి చూపించండి తోటివారిమీద, తండ్రులారా దయ వుంచండి. తోటి మనుష్యుల్ని నమిలి మ్రింగకండి –

అవును అది చంద్రనిప్పులు చెరగవలసిన మండువేసవి. కాని ఆరోజెందుకోగాని మీ నాన్నగారి శవంమీద దివినుండి భువికి దేవతలు వర్షం కురిపించారు.

# మా మావగారి శోషలిజం

మా అత్తగారు ఊళ్లోలేనపుడు ఇంట్లో సోషలిజాన్ని ప్రవేశపెట్టారు.

మామావగారు. మరి పెద్దదిక్కు లేనపుడు ఇంట్లో అంతా శోషలిజమే కదా; నిండుసభలో దుశ్శాసనుడు ద్రౌపది వలువలను దుల్చినట్లు బడియల్సులోనుంచి బడియాలు లాగుతూంటారు మా వాళ్ళు. దొడ్లో మొక్కలు నాటినట్లు విప్లవబీజాలు నాటుతుంటారు మా ఇంట్లో –

అంచేత మా ఇల్లు ఒక డెవిల్సు వర్క్ షాప్ (అనగా రాక్షసుల కొంప) అంచేత అక్టోబరు విప్లవం మా ఇంట్లో జనవర్లో వచ్చేసింది.

మానాన్న వట్టి కంఠశోషలిస్టే కాని మా మామయ్యగారు గొప్ప ఐడియా పురుషులు. మా ఇల్లు ఎప్పుడూ స్వర్గసీమ కాదని, మా ఇంట్లో ఎప్పుడూ పావురాలు ఎగురలేదని – “ఇట నిట లేక్షణుండు గజ్జెకదలించి యాడు రంగ స్థలంబు” అని చెప్పాలని కాదు నా ఉద్దేశం.

క్షణంలో సగం వరకూ,

అంతా దేవతలే –

ఎటుచూసినా వెన్నెలే. ఎవరి మొహంలో నైనా చిరునవ్వులే –

మా ఇల్లు నందనవనమే,

మా కది బృందావనమే;

మా అత్తయ్య ఊళ్లో లేని నెల్లాళ్ళలో మా మామగారి సోషలిజానికి మా ఇల్లు నిరుపయోగ ప్రయోగశాల అయిపోయింది.

“కామన్ కిచెన్” – “యూనిఫామ్”

“ఇండస్ట్రీస్ – పరిశ్రమలు నెలకొల్పడం,”